క్లుప్తంగా

సాగర తీరాన్ని పరిశుభ్రంగా ఉంచుదాం

బీచ్‌రోడ్డు: మహా శివరాత్రి సందర్భంగా సాగర తీరానికి వచ్చే భక్తులు ఆ ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచాలని గోబడ్డీ సంస్థ(యాప్) ప్రతినిధి రాజు గౌడ్ పిలుపునిచ్చారు. ఆర్కే బీచ్ రోడ్డులో తీర పరిశుభ్రత కోసం శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు ప్రజలు స్వస్తి చెప్పాలన్నారు. సాగర జలాల్లో పుణ్య స్నానాలు ఆచరించే భక్తులు భారీ కెరటాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు సంపత్ సాయి, ఆనంద్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రావ్యంగా గాత్ర కచేరీ



కీర్తనలు ఆలపిస్తున్న వివేక్ సదాశివం

మద్దిలపాలెం: విశాఖ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో శనివారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో నిర్వహించిన గాత్ర కచేరీ శ్రావ్యనందకరంగా సాగింది. చెన్నైకి చెందిన వివేక్ సదాశివం పలు కీర్తనలు ఆలపించి అలరించారు. కచేరీకి వయోలిన్‌పై శ్రీకాకుళానికి చెందిన ఎం.సత్యనారాయణ, మృదంగంపై రాజమహేంద్రవరానికి చెందిన కె.యోగేష్, ఘటంపై తాడేపల్లి గూడేనికి చెందిన ఎస్.హనుమంతరావు సహకారం అందించారు.

రేపటి నుంచి విజయదుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం


విజయదుర్గాదేవి ఆలయం

ఆరిలోవ: హనుమంతవాక దరి విజయదుర్గాకాలనీలో వియదుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం సోమవారం నుంచి మూడు రోజులపాటు జరగనుంది. ఆలయ ఆవరణను విద్యుత్ దీపాలతో అలంకరి స్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం సుప్రభాత సేవ, విఘ్నేశ్వర పూజ, హోమంతో ప్రారంభించి పెదగదిలి వద్ద పోలమాంబ ఆలయం నుంచి 108 కలశాలతో భక్తులు ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి క్షీరాభిషేకం చేయనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎస్.ఎస్.ఎన్ రాజు తెలిపారు. సాయంత్రం అమ్మవారిని పల్లకీలో ఊరేగిస్తామన్నారు. 21న సామూహిక లక్ష కుంకుమార్చన, 22న మధ్యాహ్నం భక్తులకు మహాన్నదానం, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు, జాతర నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఎస్‌బీసీ వంతెన మీదుగా వాహనాలకు అనుమతివ్వాలి


మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు

మద్దిలపాలెం: డాక్‌యార్డ్ వంతెన మరమ్మతులు పూర్తయ్యే వరకూ మాల్కాపురం వెళ్లే వాహనాలకు ఎస్‌బీసీ వంతెనపై నుంచి అనుమతులు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు డిమాండ్ చేశారు. పిఠాపురంకాలనీలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ డాక్‌యార్డ్ వంతెన మరమ్మతుల కారణంగా 15 నెలల పాటు మూసివేయడంతో జనజీవనం ఇబ్బందులకు గురతోందన్నారు. దీంతో అదే మార్గంలోని డాక్‌యార్డ్, షిప్‌యార్డు, హెచ్‌పీసీఎల్, ఐవోసి, కోరమాండల్, ఎపీసీఎల్, ఎస్సార్, ఆర్‌సీఎల్ పరిశ్రమలతోపాటు పోర్టు ఆధారిత గోదాములలో వేలాదిమంది ఉద్యోగులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఎస్‌బీసీ బ్రిడ్జి పై నుంచి రాకపోకలు మార్గం కల్పిస్తే కార్మికులు ఉపశమనంగా ఉంటుందన్నారు. దీన్నిపై పోర్టు అధికారులు నిర్ణయం తీసుకోవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో మద్దిలపాలెం జోన్ కార్యదర్శి వి.కృష్ణారావు, పైడిరాజు పాల్గొన్నారు.


కైలాసనగర్‌లో శివుడిని దర్శించుకుంటున్న మేయర్ గొలగాని హరివెంకటకుమారి దంపతులు


డ్రైవర్స్ కాలనీ శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు


భక్తులతో కళకళలాడుతున్న పీతలవానిపాలెంలోని రామలింగేశ్వర స్వామి ఆలయం

హర హర మహాదేవ

- భక్తిశ్రద్ధలతో మహాశివరాత్రి వేడుకలు
- మార్మోగిన శివ నామస్మరణ
- భక్తులతో పోటెత్తిన ఆలయాలు


కాశీ విభూదిని పంపిణీ చేస్తున్న సత్యకుమార్ తదితరులు

ఆరిలోవ: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శనివారం నియోజకవర్గంలోని శంకరుడి ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. ఆరిలోవలోని శివాలయాల్లో వేకువజాము నుంచి స్వామికి పూజలు, అభిషేకాలు చేశారు. ఆరిలోవ కాలనీ ఆఖరి బస్‌స్టాప్, శివాజీనగర్-2, నెహ్రూనగర్, డ్రైవర్స్ కాలనీ, కైలాసనగర్, రవీంద్రనగర్, ఆదర్శనగర్, పెదగదిలి, హనుమంతవాక, విశాలాక్షినగర్ ప్రాంతాల్లోని శివాలయాలు భక్తుల శివ నామస్మరణతో మార్మోగాయి. మహిళలు ధ్వజ స్తంభాల వద్ద పసుపు, కుంకుమతో పూజించారు. శివరాత్రితోపాటు శని త్రయోదశి కావడంతో భక్తులు నవగ్రహాలను దర్శించుకుని పూజలు


ప్రత్యేక అలంకరణలో మృత్యుంజయేశ్వరుడు

జరిపారు. 11వ వార్డు కైలాసనగర్‌లోని శివాలయాన్ని మేయర్ గొలగాని హరివెంకటకుమారి, శ్రీనివాస్ దంపతులు దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ నిర్వాహకులు సాదర స్వాగతం పలికారు. అర్చకులు ప్రత్యేక పూజలు జరిపించారు.

ప్రత్యేక పూజలు

మద్దిలపాలెం: పీతలవానిపాలెంలోని రామలింగేశ్వర స్వామి ఆలయంలో వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు, రాత్రి మహాన్యాస రుద్రాభిషేకం, జాగరణ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. హెచ్‌బీ కాలనీ, ఇసుకతోట, కేఆర్‌ఎం కాలనీ, ఇసుకతోట ప్రాంతాల్లోని శివాలయాలు భక్తులలో కిక్కిరిసిపోయాయి.

పార్వతీ ముక్తేశ్వర పాహిమాం

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ సెక్టార్-6లోని సిద్ధివినాయక పార్వతీ ముక్తేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు, ఏకవారాభిషేకాలు, ద్వాదశ జ్యోతిర్లింగాలకు అభిషేకాలు, ఏక రుద్రాభిషేకాలు నిర్వహించారు. పార్వతీముక్తేశ్వరుడిని దర్శించుకోవడం కోసం పెద్ద ఎత్తున భక్తులు బారులు తీరారు. సెక్టార్-9లోని శివాలయంలో మహాదేవుడికి విశేష పూజలు చేశారు.


పెదవాల్తేరు కాశీ విశ్వేశ్వరాలయంలో భక్తులు


ఆరిలోవ ఆపరేషన్ కాలనీలోని కాశీ విశ్వేశ్వరాలయ పూజల్లో పాల్గొన్న భక్తులు

➡ ఎంవీపీ కాలనీ అప్పుఘర్ తీరంలోని సీతారామ సాగర లింగేశ్వరాలయంలో భక్తులు కుటుంబ సమేతంగా విశేష పూజలు చేశారు.

ఎంవీపీ సెక్టార్-9లో..

తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీ సెక్టార్-9లోని మూలపాలెం శ్రీ అచల గీతాశ్రమం, శ్రీ వైశాఖేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి ఘనంగా నిర్వహించారు. డీపీపీ సూపరింటెండెంట్ ఎస్‌కే చంద్రమౌళీశ్వరశర్మ , ఆధ్యాత్మిక వేత్త సత్యకుమార్ ప్రత్యేక పూజలు చేశారు. బిల్వదళార్చన, అభిషేకం, హరికథాగానం తదితర కార్యక్రమాలు జరిగాయి. జేజీ నారాయణ ప్రదర్శించిన మార్కండేయ చరిత్రను హరికథా గానాన్ని భక్తులు వీక్షించారు. అనంతరం ఎస్‌కే చంద్రమౌళీశ్వరశర్మ , ఆధ్యాత్మిక వేత్త సత్యకుమార్‌లు భక్తులు కాశీ విభూదిని పంపిణీ చేశారు.


అప్పుఘర్‌లో సాగర లింగేశ్వరుడికి పూజలు చేస్తున్న భక్తులు

శివయ్యకు రుద్రాభిషేకాలు

ఏయూక్యాంపస్: పెదవాల్తేరులోని కాశీ విశ్వేశ్వరాలయం, అసంగానంద ఆశ్రమంలోని మృత్యుంజయ ఆలయం, ఈస్ట్ షిర్డీ ప్రాంగణంలోని శివాలయాల్లో కుటుంబ సమేతంగా భక్తులు ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు జరిపారు. పురోహితులు రుద్రాభిషేకాలు నిర్వహించారు. మహిళలు ఆలయం ధ్వజ స్తంభం వద్ద దీపారాధన జరిపారు. అర్ధరాత్రి లింగోద్భవ సమయం వరకు పరమేశ్వరుడికి భక్తులు అభిషేకాలు జరిపించారు.

108 లింగాలతో ప్రదోషకాల శతరుద్రాభిషేకం



బీచ్‌రోడ్డు: మహా శివరాత్రి సందర్భంగా విశ్వభారత్ మీడియా ఆధ్వర్యంలో 108 లింగాలతో ఆర్.కె.బీచ్‌లో ప్రదోషకాల శతరుద్రాభిషేకం ఘనంగా నిర్వహించారు. రుద్ర హవనం, పాశుపత హోమం వంటి విశేష, విశిష్ట పూజలు చేశారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివరాత్రి భక్తుల కోసం ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సాగరతీరంలో శివరాత్రి సందర్భంగా రెండు కార్యక్రమాలు జరగడంతో.. భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా పోలీసులు ట్రాఫిక్‌పై ప్రత్యేక దృష్టి సారించారు. రోడ్డుపై నిలుపుదల చేసిన వాహనాలను టోయింగ్ వాహనంపై తరలించిట్లు మూడో పట్టణ ట్రాఫిక్ సీఐ షణ్ముఖరావు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో జాగరణ


విద్యుద్దీపాలంకరణలో చెంగల్రావుపేటలోని జామియా మసీదు

బీచ్‌రోడ్డు: మహాశివరాత్రి పర్వదినంతో పాటు ముస్లింల షబే-మెహరాజ్ వేడుకను శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. శివరాత్రి వేడుకల్లో భాగంగా భక్తులు ఆదివారం వేకువజాము వరకు జాగరణ చేశారు. షబే-మెహరాజ్ పురస్కరించుకొని మసీదుల్లో రాత్రంతా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మహ్మద్ ప్రవక్త దైవదర్శన యాత్ర చేసిన పుణ్యదినాన్ని షబే-మెహరాజ్‌గా ఖురాన్‌లో పేర్కొన్నట్లు మతగురువులు చెబుతారు. ఈ సందర్భంగా మసీదులను విద్యుత్ దీపాలతో అలంకరించారు. మహాశివరాత్రి, షబే-మెహరాజ్ పండగలు ఈ ఏడాది ఒకే రోజు రావడం విశేషం.

సముద్ర స్నానాలకు ప్రత్యేక ఏర్పాట్లు


జోడుగుళ్లపాలెం బీచ్ వద్ద జీవీఎంసీ ఏర్పాటు చేసిన టెంట్, సిద్ధం చేసిన పడవలు

ఆరిలోవ: మహాశివరాత్రి సందర్భంగా శివాలయాల్లో పూజల అనంతరం రాత్రంతా భక్తులు జాగారం చేస్తుంటారు. అనంతరం మరుసటి రోజు వేకువజాము నుంచి సముద్ర స్నానాలు చేయడం పరిపాటి. నగర వాసులు ఎక్కువగా అందుబాటులో ఉన్న సముద్ర తీరాలకు వెళ్తుంటారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని జీవీఎంసీ అధికారులు, నగర పోలీసులు భక్తులకు సౌకర్యం, రక్షణ కోసం ఏర్పాట్లు చేశారు. ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో జోడుగుళ్లపాలెం, సీతకొండ, సాగర్‌నగర్, రుషికొండ తీరాల్లో స్నానాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ప్రమాదం జరగకుండా చర్యలు చేపడుతున్నారు. ఆయా బీచ్‌ల వద్ద పోలీసు బందోబస్తు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే అన్ని బీచ్‌ల వద్ద బోట్లు సిద్ధం చేశారు. వాటిలో గజ ఈతగాళ్లను నియమించారు. నీటిలో కొంతదూరం మాత్రం స్నానాలు చేయడానికి పరిమితి విధించారు.

సిద్ధంగా గజ ఈతగాళ్లు..

ఒడ్డుకు కొంత దూరంలో నీటిలో వరసగా గజ ఈతగాళ్లు ఉన్న బోట్లు సిద్ధంగా ఉంచుతున్నట్లు ఆరిలోవ సీఐ సోమశేఖర్ తెలిపారు. రుషికొండ నుంచి జోడుగుళ్లపాలెం వరకు బీచ్‌లలో సుమారు 150 మంది పోలీస్ సిబ్బంది, గజ ఈతగాళ్లను నియమించినట్లు చెప్పారు. భక్తులు నీటి లోపలకు వెళ్లకుండా ఒడ్డునే పుణ్య స్నానాలు చేసుకోవాలని, పోలీసులకు సహకరించాలని కోరారు. జీవీఎంసీ అధికారులు ఆయా బీచ్‌ల వద్ద మహిళా భక్తులు తడి దుస్తులు మార్చుకోవడానికి ప్రత్యేకంగా టెంట్లు ఏర్పాటు చేశారన్నారు. భక్తులకు ప్రసాదాల పంపిణీ కోసం స్థానిక సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు టెంట్లు వేసి సిద్ధమయ్యాయి.

ఘనంగా సర్వధర్మ సమ్మేళనం


జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభిస్తున్న మేయర్ హరివెంకటకుమారి, శ్రీనివాస్

మద్దిలపాలెం: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని సర్వధర్మ సమ్మేళనాన్ని శనివారం హెచ్‌బీ కాలనీలోని బ్రహ్మకుమారీస్ ప్రజాపిత బ్రహ్మ సేవ కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నగర మేయర్ గొలగాని హరివెంకట కుమారి, శ్రీనివాస్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ లోకానికి వెలుగులు ఇచ్చే పర శివుడ్ని మహాశివ రాత్రి పర్వదినం రోజున పూజలు చేయడం ఎంతో పుణ్యమన్నారు. బ్రహ్మకుమారి రామేశ్వరి మాట్లాడుతూ భగవంతుడు జనన, మరణ రహితుడన్నారు. ఈకార్యక్రమంలో పతాంజలి యోగా శాస్త్ర గురూజీ వేద భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

శివుడికి సహస్ర కలశ పూజ


చినగదిలి షిర్డీసాయి మందిరంలో సహస్ర కలశ పూజ చేస్తున్న భక్తులు

ఆరిలోవ: చినగదిలి నార్త్ షిర్డీసాయిబాబా మందిర ప్రాంగణంలోని ఈశ్వరుడి గుడిలో శివరాత్రి పూజలు శనివారం ఘనంగా నిర్వహించారు. భక్తులు శివుడిని ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు సాయంత్రం 7 గంటల నుంచి అర్ధరాత్రి వరకు సహస్ర కలశ పూజ, రుద్రాభిషేకం నిర్వహించారు. సహస్ర కలశ పూజలు 108 వనమూలికలు కలిపిన నీటితో సంప్రదాయ పద్ధతిలో శివుడికి అభిషేకం చేశారు. అనంతరం రుద్రాభిషేకం జరిపారు. సహస్ర కలశ పూజలో రాజ్యసభ సభ్యుడు జి.వి.ఎల్.నరసింహారావు పాల్గొని శివుడికి పూజలు చేశారు.

ఆంగ్లో ఇండియన్ల అభ్యున్నతికి కృషి

ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ


మాట్లాడుతున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

బీచ్‌రోడ్డు: రాష్ట్రంలోని ఆంగ్లో ఇండియన్ల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీ ఎంవివి సత్యనారాయణ అన్నారు. శనివారం ది ఫెడరేషన్ ఆఫ్ ఆంగ్లో ఇండియన్స్ అసోసియేషన్స్ ఇన్ ఇండియా సంస్థ 10వ వార్షికోత్సవాన్ని నగరంలోని ఓ హోటల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఆంగ్లో ఇండియన్లు రాష్ట్ర ప్రజలతో కలిసి మెలిసి ఉండటం చాలా సంతోషంగా ఉందన్నారు. మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ జాన్‌వెస్లీ మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం ఆంగ్లో ఇండియన్లను పట్టించుకోలేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభు త్వం వచ్చిన తరువాత ఆంగ్లో ఇండియన్స్‌కు కమ్యూనిటీ సర్టిఫికెట్లు జారీ చేయటంతో పాటు పింఛన్లు కూడా అందిస్తున్నారన్నారు. ఆంగ్లో ఇండియన్స్‌కు చట్టసభల్లో స్థానం కల్పించేందుకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డితో చర్చించటం జరుగుతుందన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు చార్లెస్ డైస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తమ సమస్యల పరిష్కారానికి సానుకూల దృక్పథంతో ఉండటం అభినందనీయమన్నారు. ప్రభుత్వ స్కూళ్లలో ఇంగ్లిష్ మీడియం పెట్టడం సంతోషకరమన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు పింఛన్ పత్రాలను అందజేశారు.

ఎన్నికల అధికారిపై కలెక్టర్‌కు ఫిర్యాదు

విశాఖ విద్య: ఐఎన్‌సీఈ కో-ఆపరేటివ్ సొసైటీ ఎన్నికల నిర్వహణలో ప్రస్తుత పాలక వర్గానికి వత్తాసు పలుకుతున్న ఎన్నికల అధికారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు ఐఎన్‌సీఈ, బీఎంఎస్ యూనియన్ల నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24న జరగనున్న సహకార ఎన్నికల్లో ప్రస్తుత పాలక వర్గమైన సీఐటీయూ అనుబంధ యూనియన్‌కు మేలు చేసేలా ఎన్నికల అధికారి వ్యవహరిస్తున్నారని ఆరోపించా రు. ఎన్నికల అధికారిని తక్షణమే మార్చాలని డిమాండ్ చేశారు. ఎన్నికల నిష్పక్షపాతంగా నిర్వహించేలా కలెక్టర్, సహకార శాఖ జిల్లా రిజిస్ట్రార్ జోక్యం చేసుకోవాలని ప్రోగ్రెసివ్ ఫ్రంట్ నాయకులు ఎస్.రాజేష్ కోరారు.

త్వరలో కెరీర్ ఓరియంటేషన్, గైడెన్స్ సెల్

- గిరిజన వసతిగృహాన్ని సందర్శించిన ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబు
- వార్డెన్ బదిలీకి సిఫారసు


విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న రవిబాబు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీలోని గిరిజన విద్యార్థినుల వసతి గృహంలో కెరీర్ ఓరియంటేషన్, గైడెన్స్ సెల్ త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు ఆంధ్ర ప్రదేశ్ ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ కుంభా రవిబాబు పేర్కొన్నారు. శనివారం సాయంత్రం వసతి గృహానికి చేరుకున్న ఆయన గంటన్నరకు పై గా విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలు, విద్యార్థుల సంఖ్య, వాష్ రూమ్స్, వార్డెన్ కార్యాలయంలో నిర్వహిస్తున్న స్టాక్ ఫైల్స్, మెస్ నిర్వహణను పరిశీలించారు. గత ఏడాది సెప్టెంబర్ నుంచి నిర్వహణ బిల్లులు పెండింగ్‌లో ఉన్న విషయాన్ని తెలుసుకున్నారు. ఐదేళ్లుగా ఇక్కడే విధులు నిర్వహిస్తున్న వార్డెన్ బదిలీకి సిఫార్సు చేయనున్నట్లు తెలిపారు. బాత్ రూమ్స్‌కు తలుపులు సక్రమంగా లేకపోవడం, వీధి దీపాలు వెలగకపోవడం వంటి పలు సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి రవిబాబు మాట్లాడుతూ ఉన్నత లక్ష్యాలు దిశగా విద్యనభ్యసించాలని సూచించారు. హాస్టల్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డెన్ ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

వీరభద్రుడికి విశేష పూజలు


వీరభద్ర స్వామికి అభిషేకాలు చేస్తున్న భక్తులు


వీరభద్ర స్వామి ఆలయం వద్ద భక్తుల సందడి

మద్దిలపాలెం: మహాశివరాత్రి సందర్భంగా ఇసుకతోటలోని వీరభద్ర స్వామి ఆలయం భక్తుల సందడితో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఏటా మద్దిలపాలేనికి చెందిన అచ్చి అప్పలరెడ్డి కుటుంబం ఆధ్వర్యంలో ఇక్కడ మహాశివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహిస్తారు. ఆ కుంటుంబానికి చెందిన ఒకరూ శనివారం మద్దిలపాలెంలోని తన ఇంటి నుంచి సనికాళ్లను పట్టుకుని భారీ ఊరేగింపుగా మేళతాళాల నడుమ వీరభద్ర స్వామి ఆలయానికి చేరుకోవడంతో సంబరాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆ కుటుంబీకులు స్వామికి అభిషేకాలు చేశారు. ఆలయ ప్రాంగణంలో తప్పెటగుళ్ల, కోలాటం, పులి వేషాలు, బల్ల వేషాలతో సంబరాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి వీరభద్రుడిని దర్శంచుకున్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థిగా కొణతాల

డాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వెనుకబడిన కులాల సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, గాయత్రీదేవి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కొణతాల వెంకట అప్పారావు(శ్రీనివాస్) కాంగ్రెస్ తరఫున బరిలో దిగుతున్నారు. పార్టీ కార్యాలయంలో నగర అధ్యక్షుడు గొంప గోవిందరాజు అధ్యక్షతన శనివారం జరిగిన సమావేశంలో ఈ మేరకు తీర్మానించారు.

22న ప్రపంచ స్కౌట్ థింకింగ్ డే

మద్దిలపాలెం: స్కౌట్స్ అండ్ గైడ్స్ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 22న స్కౌట్ థింకింగ్ డే నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ రాష్ట్ర కమిషనర్ నరవ ప్రకాశరావు తెలిపారు. ప్రపంచ స్కౌట్ ఉద్యమ నిర్మాత బాడెన్ పావెల్ 1857 ఫిబ్రవరి 22న లండన్‌లో జన్మించారన్నారు. ఆయన జయంతి రోజున ప్రపంచ స్కౌట్ అండ్ గైడ్స్ దినోత్సవంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. జిల్లా విద్యా శాఖ అధికారి ఆదేశాల మేరకు ఈ నెల 22, 23 తేదీల్లో జిల్లా వ్యాప్తంగా ర్యాలీలు నిర్వహించడంతో పాటు పలు అంశాలపై పోటీలు ఏర్పాటు చేశామన్నారు. బీహెచ్‌పీవీ మార్గంలోని సంసిదా ఇంటర్నేషనల్ స్కూల్ ఆవరణలో ఈ వేడుకలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు నెహ్రూ అవార్డులు

ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్‌కు చెందిన 96 మంది ఉద్యోగులకు యాజమాన్యం జవహర్‌లాల్ నెహ్రూ అవార్డులను అందజేసింది. స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తి, ఉత్పాదకత, క్రమశిక్షణ కలిగిన ఉద్యోగులకు ఏటా ఉక్కు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అవార్డులను అందజేస్తోంది. ఇందులో భాగంగా శనివారం ఉక్కునగరం ఎంపీ హాలులో స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్ చేతులు మీదుగా 49 మంది అధికారులు, 49 మంది కార్మికులకు అవార్డులను అందజేశారు. అదే విధంగా ప్రతిభ చూపిన సీఐఎస్‌ఎఫ్ సిబ్బందికి కమెండేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్లు వీవీ వేణుగోపాలరావు, డీకే మహంతి, బాగ్చీతోపాటు పలువురు ఉన్నతాధికారులు, అవార్డు గ్రహీతల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మానసిక ప్రశాంతతే పెద్ద సంపద


సదస్సులో పాల్గొన్న యువతతో నిర్వాహకులు

ఏయూక్యాంపస్: ప్రపంచ దిశ దశను మార్చగల సత్తా యువతకే ఉందని సహజ యోగ ప్రతినిధి నేషనల్ ట్రస్ట్ ఉపాధ్యక్షుడు రమేష్ అన్నారు. ఏయూ స్నాతకోత్సవ మందిరంలో నిర్వహిస్తున్న మాతాజీ నిర్మలా దేవి శత జయంతి ఉత్సవాలలో భాగంగా రెండో రోజు యువశక్తి విభాగం ఆధ్వర్యంలో యువతకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. నేడు యువత పెడతోవ పట్టడానికి గల కారణాలను సహజ యోగ ప్రతినిధులు వివరించారు. యువత చక్కని లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని చేరేందుకు క్రమశిక్షణతో, అంకితభావంతో పనిచేయాలన్నారు. యువత పోషించే పాత్ర పైనే ఆ దేశ అభివృద్ధి ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు సోంబాబు, వెంకటరెడ్డి, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.